

హెరాల్డ్ కారు మెత్తగా రోడ్డు పైన జారిపోతూంది.

శ్రీరామ్ డ్రైవ్ చేస్తున్నాడు. విజయ తన చూపుని అతని మీంచి రోడ్డు పైకి సారించింది.

మంచు కురుస్తూంది. వెన్నెల తెల్లగా పరుచుకొని ఉంది. రాత్రి పది దాటుతూంది.

తన కేమీ తోచడం లేదంటే శ్రీరామ్ షైరుగా తీసుకెళుతున్నాడు.

కారు బంజారా హిల్స్ దారి పట్టింది. జర్నలిస్ట్ కాలనీకి దారి తీసే రోడ్డు దగ్గర కారు ఆపేశాడు శ్రీరామ్.

విజయ ఉలిక్కిపడింది. కారు సరిగ్గా శ్మశానం దగ్గర ఆపాడు.

శ్రీరామ్ కారు దిగి బానెట్ నానుకొని నించున్నాడు. విజయ కతని ప్రవర్తన బొత్తిగా నచ్చలేదు. షాల్ తొడుక్కుంటూ దిగింది.

"బాగుంది. నన్ను షైరు తీసుకు రావడానికి హైదరాబాద్‌లో ఇంతకంటే మంచి ప్రదేశం దొరకలేదా?" అంది అతనికి దగ్గరగా నడుస్తూ.

శ్రీరామ్ తల తిప్పి ఓ సారి విజయ కళ్ళలోకి చూసి సిగరెట్ వెలిగించాడు.

అతని కళ్ళలో మెరిసిన కన్నీటి పొరల్ని విజయ గమనించింది.

శ్రీరామ్ పొగని గాలిలోకి వదిలి చెప్పాడు:

"సరిగ్గా సంవత్సరం క్రితం జ్యోతిని ఇక్కడే దహనం చేశాను." ఆ మాట అతనంటున్నప్పుడు తన సర్వాన్నీ కోల్పోయానన్న బాధ ఆ మాటల్లో కనబడింది.

"సో సారీ!" అంది.

శ్రీరామ్ అదోలా నవ్వాడు.

"జ్యోతి అదృష్టవంతురాలు. ఎటొచ్చీ నేనే ప్రతి క్షణం ఆమె జ్ఞాపకాలతో చిత్రవధకి గురై పోతున్నాను. బహుశా ఈ జన్మ కిక నేను జ్యోతిని మరచిపోలే నేమో?"

"చనిపోయికూడా నీ హృదయంలో స్థానాన్ని పోగొట్టుకోని జ్యోతి పైన నాకు జెలసీగా ఉంది" అంది విజయ.

"జ్యోతికి జెలసీ అంటే ఏమిటో తెలియదు. జ్యోతితో నా రెండేళ్ళ కాపురం రెండు క్షణాల్లో గడిచి పోయిం దనిపిస్తుంది."

"నువ్వు చాలా మంచివాడివి, శ్రీరామ్!"

"నేనా?!"

"అప్పటికి, ఇప్పటికీ నీలో ఇంత మార్పొచ్చిందంటే చాలా బాధగా ఉంది."

"నేను నిజంగా మారిపోయానా, విజయా?"

అతనలా అడుగుతూంటే విజయకి అతణ్ణి తన గుండెల్లో దాచుకోవాలనిపించింది.

"పాదరసం కంటె చురుగ్గా ఉండే వాడివి."

"ఇప్పుడూ?"

"బండరాయిలా అయిపోయావు."

"వెళదామా?"

"అప్పుడేనా?" అడిగింది.

"నా కేమిటో భయంగా ఉంది."

విజయ నవ్వింది.

"ఏం? నన్నుకూడా ఈ శ్మశానంలో వదిలివేయా లనిపిస్తుందనా?"

"విజ్జీ! !"

"పద, వెళదాం."

కారు కదిలింది.

విజయ కేం మాట్లాడ్డానికీ తోచ లేదు. శ్రీరామ్ వంక చూస్తూ కూర్చుంది.

పావు గంటలో ఇల్లు చేరారు.

విజయకి నిద్ర పట్టటం లేదు. పాత జ్ఞాపకాలు సారచేపల్లా పట్టి మనసుని తింటున్నాయి.

శ్రీరామ్ తన అన్నకి స్నేహితుడు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కూడా అతడు వచ్చేవాడు. శ్రీరామ్ పైన తానెన్నో ఆశల్ని పెంచుకుంది. కలలు కంది. అతణ్ణి రెచ్చగొట్టడానికి చాలా సార్లు ప్రయత్నం చేసింది.

ఆ రోజు తనకి బాగా గుర్తు.

తను జామచెట్టెక్కి కూర్చుంది. అంతలో అత నొచ్చాడు.

చెట్టుమీంచి జామపిందెతో అతణ్ణి కొట్టింది.

ఆ పిందెని చేత్తో ఎగరేసి పట్టు కుంటూ చెట్టు కిందకి వచ్చాడు.

"ఏమిటి? కోతిలా చెట్టెక్కావు? దిగు! !" అన్నాడు.

"ఊహూఁ. నేను దిగను!"

"ఆడపిల్లవి. పడిపోతే దెబ్బ తగులు తుంది."

"కింద చెట్టంత మగా డుంటే ఆడపిల్ల కేం భయం? అయినా, నేను కింద పడితే నువ్వు పట్టుకోలేవూ?" అంది తను.

"పట్టుకోవడానికి బాగానే ఉంటుంది— వదిలితే నడ్డి విరుగుతుంది."

తరవాత తను చెట్టు దిగగానే చెవి మెలి పెట్టాడు. అది గుర్తు కొచ్చి విజయకి చెంప తెర్రబడ్డాయి.

ఏదన్నా నిద్ర మాత్ర వేసుకుంటే గాని నిద్ర వచ్చేలా లేదు.

శ్రీరామ్ ఏం చేస్తున్నాడో చూడా లనిపించింది. మెల్లగా లేచి అతని గది

**మల్లవరపు ఉషా గాయత్రి**

వైపు నడిచింది. గుమ్మంలోనే ఆగి పోయింది.

శ్రీరామ్ సోఫాలో కూర్చున్నాడు. అతని ముందున్న టీపాయ్ మీద స్కాచ్ విస్కీ బాటిల్, గ్లాసులో సగానికి పైగా వంపబడిన ఔషధం కనపడ్డాయి.

శ్రీరామ్ తాగుతున్నాడు! విజయకు అది గుండెలో చేయిపెట్టి దేవినట్లయింది. బాధ మనిషిని ఎలా పీడిస్తుందో కళ్ళారా చూస్తూంది విజయ.

వెళ్ళి అతని కెదురుగా కూర్చుంది— అతను తల ఎత్తి చూశాడు.

అతని కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి.

"ఇదికూడా మొదలుపెట్టావా, శ్రీరామ్? !"

విజయ గొంతులో నిస్పృహ కొట్టొచ్చి నట్లుగా ఉంది.

"జ్యోతిని మరిచిపోవటాని కింత కంటే మార్గం నాకు కనబడలేదు, విజ్జీ."

"పిచ్చివాడివై పోతున్నావు! ఆరోగ్యం పూర్తిగా పాడై పోతూంది. తాగడం మానేయ్!"

"డాక్టర్ననిపించావు!"

"సమయానికి గుర్తు చేశావు. నేను డాక్టరుగా చెపుతున్నాను."

"నాకు లేడీ డాక్టర్లతో ట్రీట్ మెంట్ చేయించుకునే అలవాటు లేదు."

"నేను నీ శ్రేయోభిలాషిని."

"థాంక్స్! నువ్వు మెడికల్ కాన్ఫరెన్స్‌కి వచ్చావా లేక నాకు ట్రీట్ మెంట్ ఇవ్వటానికా?"

"నువ్వేమన్నా అనుకో. నువ్వు తాగడానికి వీల్లేదు!"

"ప్లీజ్, విజ్జీ! దయచేసి ఆంక్షలు పెట్టకు. ఇవే లేకపోతే నేను ఇన్ని రోజులు బ్రతికేవాడిని కానేమో? దయచేసి నువ్వెళ్ళి పడుకో!" గ్లాసుని నోటి దగ్గరకి తీసుకొని గడగడా తాగేస్తుంటే విజ్జీకి ఏడుపొచ్చింది. ఆవేశమొచ్చింది. తను శ్రీరామ్ జీవితంలో ప్రవేశించి ఉంటే అతని జీవితం ఈ రోజు ఇంత దౌర్భాగ్యంగా తయారయేది కాదు. శ్రీరామ్‌ని చేరలేకపోతున్న దిగులు మనసుని ప్రతి క్షణం వెంటాడుతున్నా, పాత జ్ఞాపకాలన్నీ మరిచిపోవటానికి ప్రయత్నిస్తూ, సాధ్యమైనంతవరకు రోగుల్ని చూస్తూ డాక్టరుగా తన జీవితాన్ని లాగేస్తూంది విజయ.

అన్నయ్యా, అమ్మా ఎంత చెప్పినా వినకుండా పెళ్ళి మానేసింది.

అక్కణ్ణించి లేచి గబగబా లోపలికి పరుగెత్తింది.

మంచం పైన వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది.

జీవితంలో అతనికి కనబడకూడ దను కుంది తను. దిక్కుమాలిన 'కాన్ఫరెన్స్' లేకపోతే తను హైదరాబాద్ వచ్చేది కాదు. అతను కనబడేవాడు కాదు.

అన్నయ్య మరీ మరీ చెప్పబట్టి అతని ఇంట్లో దిగింది.

శ్రీరామ్ అంటే అప్పటివరకున్న జాలి ఎగిరిపోయింది. కసిగా ఉంది. పెళ్ళీ పెటాకులూ లేకుండా తనిలా అయిపోవ టానికి కారణం శ్రీరామ్. తన మనసుని గ్రహించలేని ఫూల్ శ్రీరామ్!

ప్రేమించే హృదయాన్ని గుర్తించని నేరానికి అత నిలా శిక్షని అనుభవించ వలసిందే.

అతణ్ణి సాధించాలని ఉంది విజయకి.

ఎదురుగా ఉన్న అద్దాల బీరువా వైపు చూసింది. దాన్నిండా చీరలూ, బ్లౌజులూ.

ఏడు పొచ్చింది. అవన్నీ జ్యోతివి.

తను శ్రీరామ్ జీవితంలో ప్రవేశించి ఉంటే ఈ రోజు తన చీరలూ, బ్లౌజులూ ఆ బీరువాలో ప్రవేశించి ఉండేవి—

విజయకి లీలగా గుర్తు వచ్చింది.

అన్నయ్య, తను, శ్రీరామ్ కలిసి శారీ ఎంపోరియమ్‌కు వెళ్ళారు. అక్కడ చీరల్ని చూస్తుంటే తన కళ్ళు చెదిరి పోయినాయి.

అన్నయ్య ఎవరో స్నేహితుడితో మాట్లాడుతున్నాడు.

తనడిగింది శ్రీరామ్‌ని.

"ఏ చీర బాగుందో సెలక్ట్ చెయ్!" అని.

"నాకు చీరల గురించి తెలియదు."

తనప్పుడు కళ్ళు పెద్దవిచేసి చూసింది.

"పోనీ, నే నే చీర కట్టుకుంటేబాగుం టుందో చెప్పు!"

"అందమైన వా ళ్ళే చీర కట్టినా బాగానే ఉంటుంది."

"నే నందంగా ఉంటానా?" అడిగింది తను.

అతను నవ్వాడు.

"నవ్వి ఊరుకోవడానికి కాదు అడి గింది. ఏదో చెప్పు!"

లేత నీలం రంగు సైలెక్సు చీరని సెలెక్ట్ చేశాడు. ఆ రోజు తను చాలా సంబరపడింది.

విజయ మంచం పైన లేచి కూర్చుంది. అత నేం చేస్తున్నాడో చూడా లనిపించింది. గబగబ అడుగులేస్తూ అతని గదిలో కెళ్ళింది.

శ్రీరామ్ నేలమీద బోర్లా పడి ఉన్నాడు. స్పృహలో లేడు. పక్కనే దొర్లి పోయిన స్కాచ్ సీసా!

అత నలాంటి స్థితిలో చూసేసరికి అప్పటి వరకున్న ఆవేశం కాస్త చల్లారి పోయింది.

అతణ్ణి లేపి మంచం మీద పడుకో బెట్టాలనిపించింది.

కాని, తనకి సాధ్యమా?

ఆరడుగుల మనిషి శ్రీరామ్. నరుపు ముక్కలా ఊగిపోతూ నడిచి వస్తుంటే, అతణ్ణి కిటికీలోంచి చూస్తుండేది తను. అతను నడుస్తుంటే అదోలా అందంగా ఉంటుంది.

అత నెప్పుడొస్తాడా అని ఎదురు చూసేది. ప్రత్యేకంగా కాఫీ కలిపి ఫ్లాస్కులో పోసి రెడీగా ఉంచేది.

కాఫీ కప్పు అందుకుంటూ, "రోజూ ఎందుకూ?" అనేవాడు.

"నువ్వు కాఫీ తాగకపోతే నాకు తల నొప్పి" అనేది తను. శ్రీరామ్ నవ్వేవాడు.

అతను కాఫీ మనిషి. ఏదన్నా తినమని పెడితే తెగ చిరాకు పడేవాడు. కాఫీ మాత్రం అడిగి తాగేవాడు.

మోకాళ్ళ మీద కూర్చుని అతణ్ణి భుజాలు పట్టి లేపదీసింది. అతని తల తన గుండెలకి తగులుతుంటే ఏదో తుపాను రేగుతూంది. శాశ్వతంగా అతణ్ణి తన గుండెల్లో దాచుకోవాలను కొంది. కాని, తన ప్రేమను గుర్తించే లేకపోయింది.

తనకి సాధ్యం కాకపోవటంతో అతని తలకింద తలగడని ఉంచి, అతన్నిచూస్తూ కూర్చుంది.

ఉదయం అడిగాడు శ్రీరామ్— "రాత్రి నా మీద అసహ్యం వేసింది కదూ?" అని.

ఏం చెప్పాలో తోచలేదు విజయకి.

"లేదు."

"నాకు తెలుసు, విజ్జీ! నువ్వున్న రెండు రోజులన్నా దాన్ని మానెయ్యా లను కున్నాను. కాని, నువ్వీ ఇంట్లో తిరుగు తుంటే నాకు జ్యోతి గుర్తుకొస్తోంది."

జ్యోతి స్థానాన్ని తన కివ్వాలంటా డేమో? అని ఆశగా చూసింది.

అత నింకేం మాట్లాడకపోయేసరికి నిరుత్సాహంగా చూసింది.

తనకి చెప్పాలనుంది— "శ్రీరామ్! మరేం ఫరవాలేదు. నీకు నే నున్నాను. నీ జీవితాన్ని తిరిగి వికసించేలా చేస్తాను. నీ జీవన జ్యోతి ఆరిపోయిందని, నీ జీవితమంతా అంధకారమై పోయిందనీ బాధపడకు. చిన్న వెలుగులా ప్రవేశించి నీ బ్రతుకు బాటలో నవ్య కాంతులు విరజిమ్ముతాను.. నీ జ్యోతి స్థానం ఈ రోజు నించి నాది" అని.

కానీ, తను ఆడది. మనసులో ఉన్న ప్పటికీ బయ టెలా పెడుతుంది?

అప్పుడూ అంతే. అత నొస్తున్నాడు, వెళుతున్నాడు. తొందరేం? అనుకొంది.




తను ప్రేమిస్తున్నట్లే అతనూ తనని ప్రేమిస్తున్నా డనుకొంది.

అమ్మ తనకి సంబంధం చూసింది. అప్పుడు శ్రీరామ్‌తో తను అంది "చూశావా, శ్రీరామ్! అప్పుడే అమ్మ నన్ను ఇంట్లోంచి గెంటెయ్యాలని చూస్తోంది" అని.

అతను నవ్వాడు.

"నువ్వు దూరంగా వెళ్ళిపోతుంటే ఆవిడమాత్రం ఏం చేస్తుంది?" క్రాప్ ఎగరేస్తూ అన్నాడు.

"ఏయ్! జూడా గీడా అంటున్నావు! నువ్వు మంచులా ఉంటావు. ఆ సంగతి నీకు తెలుసా?" అంది. అతను మళ్ళీ నవ్వాడు.

అతని నవ్వులో కూడా అందం ఉంది.

"నువ్వేమన్నా ఒప్పుకుంటాను."

"ఇంతకీ నన్ను పెళ్ళి చేసుకో మంటావా?"

"అది ఆరోగ్యానికి మంచిది!"

తన కప్పుడు చాలా నిరుత్సాహం కలిగింది.

"నా కిష్టం లేదు."

"ఏం?"

"పెళ్ళికొడుకు ఇడ్లీమొగంలా ఉంటాడు."

"ఇంట్లో చిన్న 'ఊ' పెట్టచ్చన్న మాట!"

"కరెక్ట్!"

"ఇంతకీ పెళ్ళికొడు కెలా ఉండాలి?" అడిగాడు.

"నీలా ఉండాలి. నువ్వే అయితే బాగుంటుంది" అనాలనిపించింది. ఆ మాటలు మనసులో స్పందించినప్పుడు సిగ్గుతో చెక్కిళ్ళు ఎరబడ్డాయి.

"హౌస్ సర్జన్సీ పూర్తి కానిదే చేసు కోను" అంది పైకి. అత నేం అనక పోవడంతో చాలా బాధనిపించింది. అతను కావాలనే అలా చేస్తున్నా డనిపించింది.

"నే నీ వేళ వెళ్ళిపోతున్నాను" అంది. ఆ మాట అంటున్నప్పుడు విజయ గొంతు బొంగురుపోయింది.

"కాన్ఫరెన్స్ పూర్తికాలేదుగా?"

"అది పూర్తయ్యే వరకు ఈ ఊర్లో ఉంటే నేను పిచ్చిదాన్నయి పోతాను" అంది.

"దౌర్భాగ్యుణ్ణి. నీ మనసుకి కష్టం కలిగించేలా ప్రవర్తించాను."

విజయ పెదవుల పైన తాత్త్విక మైన చిరునవ్వొకటి క్షణమాత్రం కదిలి మాయమైంది.

"నువ్వు నాకేమౌతావని నేను బాధ పడాలి?" అంది.

"నిజమే. నిరాశా నిస్పృహల మధ్య బ్రతికే మనిషి జీవితంలో రెండు రోజుల వెన్నెల కురిపించిన అమృతమూర్తివి నువ్వు. నువ్వెళ్ళిపోతానంటే నా కెంతో భయంగా ఉంది."

ఇద్దరి మధ్య కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయి. మాట్లాడ్డానికి మాటలు కరువయినాయి. మాటల్లో బయటపడి పోతామేమో అన్న భయం ఇద్దరిలోనూ క్షణక్షణానికీ ఎక్కువై పోతూంది.

ఇద్దరికీ మనసు విప్పి మాట్లాడు కోవాలని ఉన్నా ఏదో సంకోచం, ఆందోళన, ఆరాటం మాటల్లేకుండా చేసినాయి.

"రైలెక్కిస్తావా, శ్రీరామ్?"

"ఊఁ" అన్నాడు.

రైలు కదలడానికి సిద్ధంగా ఉంది.

కంపార్టుమెంట్‌లో కిటికీ దగ్గర కూర్చుంది విజయ. శ్రీరామ్ ప్లాట్‌ఫారమ్ మీద నిలబడ్డాడు.

రైలు కూత వేసింది.

"వెళతాను, శ్రీరామ్!" అంది విజయ.

"మళ్ళీ ఎప్పుడు?" అడిగాడు.

"ఇప్పుడూ, ఎప్పుడూ నీ దగ్గరే ఉండిపోవాలని ఉంది" అనాలనిపించింది.

విజయ కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

"జీవితంలో నువ్వున్న నీ ఊరూ రాను!" అంది గొంతు పెగల్చుకొని.

అతను నిరక్తిగా చూశాడు.

"థాంక్స్! కానీ, ఆ కన్నీళ్ళు?"

శ్రీరామ్ కేసి రోషంగా చూసింది విజయ.

"బాగుంది. పైకి కనబడే కన్నీళ్ళ గురించి అడుగుతున్నావే కానీ, ప్రతి క్షణం టార్చర్‌తో నలిగిపోతున్న నా గుండె గురించి మాత్రం అడగలేవు! నాకు తెలుసు — నీవు పిరికివాడివి. నీకు కావలసింది, పొందగలిగింది నీ ఎదురుగా ఉన్నా పొందలేని ఫూల్‌వి నువ్వు. నీలాంటి వాళ్ళ వల్ల, నువ్వేకాదు, నీ చుట్టూవాళ్ళు కూడా నష్టపోతారు. అది నీకు తెలియదు. తెలిసినా దాన్ని గురించి ఆలోచించే శక్తి గానీ, చెప్పే ధైర్యంగానీ నీలాంటి వాళ్ళకి ఉండదు. ఇవి కేవలం కన్నీటి చుక్కలు కావు. గుండె పగిలి కన్నీటి రూపంలో బయట పడే రక్తపు చుక్కలు." ఆవేశంగా అంది.

శ్రీరామ్ అయోమయంగా చూశాడు.

"విజ్జీ!" అన్నాడు.

రైలు కదిలింది. కదిలిన రైలుబండి తనకీ, శ్రీరామ్‌కి మధ్య దూరం పెంచు తూంటే ఆరడుగుల మనిషే నరువుడు ముక్కలా ఊగిపోతూ, దూరాన్ని భరించ లేను అన్నట్లుగా రైలు వెంబడే ప్లాట్‌ఫారమ్ మీద పడిపోతుంటే, చూడలేక తల తిప్పేసుకుంది విజయ. ★